సాక్షి చిత్తూరు

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



అంకురార్పణ..విశ్వక్సేనుడి వీక్షణ

తిరుమలలో దసరా బ్రహ్మోత్సవాలకు అధికారులు అట్టహాసంగా గురువారం అంకురార్పణ చేశారు. - 8లో



అలసత్వం వద్దు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. - 8లో



ఈతకు వెళ్లి ఇద్దరు మిత్రుల మృతి

బంగారుపాళెంలోని ఊటకుంట చెరువులోకి ఈతకెళ్లిన ఇద్దరు మిత్రులు లోపలకు దిగి మునిగిపోయి మృతి చెందారు. - 8లో

అశ్వియాగ్రహం



అశ్వియకు న్యాయం చేయాలని ప్లకార్డు చేతపట్టిన చిన్నారి



సంచలనం రేకెత్తించిన పుంగనూరు పట్టణానికి చెందిన చిన్నారి అశ్వియఅంజుమ్ హత్యపై ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. చిన్నారిని హత్యను చేసిన నిందితులను ఉరి తీయాలని, ఎన్‌కౌంటర్ చేయాలని అన్ని వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారి అశ్వియ హత్యను నిరసిస్తూ గురువారం రాత్రి పుంగనూరు పట్టణ ప్రజలు, హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని తూర్పుమొగశాల వద్ద గల చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా వచ్చి గోకుల్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం చిన్నారి అశ్వియ చిత్రపటానికి నివాళులర్పిస్తూ, కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారిని హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రత కల్పించాలని కోరారు. అలాగే హంతకులను పట్టుకునేంత వరకు సంఘీభావం ప్రకటిస్తామని తెలిపారు. - పుంగనూరు



చిన్నారి అశ్వియ అంజుమ్‌కు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగిస్తున్న ప్రజలు

మత్తు బాల్యాన్ని చిత్తు చేస్తుంది. సరదా వాడకం చివరకు వారి జీవితాలను నరక ప్రాయంగా మారుస్తుంది. బంగారు భవితను నాశనం చేస్తుంది. నిండు జీవితాలను పాతాళానికి తీసుకెళుతుంది. కన్నతల్లిదండ్రులకు అంతులేని ఆవేదన మిగుల్చుతుంది. సమాజాభివృద్ధికి తోడ్పడాల్సిన రేపటి పౌరులను సంఘ అశాంతికి కారకులుగా మారుస్తుంది. ఆ వ్యసనం కారణంగా చిన్నారులు నేరగాళ్లుగా మారుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.



బతుకు..బానిషా



గంజాయి పీల్చే ప్లాస్టిక్ బాటిల్

- మత్తుకు బానిసలవుతున్న చిన్నారులు
- పెడతోవపడుతున్న బాలురు
- మాదకద్రవ్యాల వినియోగంలో మైనర్లే ఎక్కువ
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న నేరాలు

పలమనేరు: విద్యార్థులు చేజేతులా జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి, హాన్స్, సిగరెట్లు ఇతరత్రా మత్తు పదార్థాలకు అలవాడు పడుతున్నారు. ఇటీవల కొందరు విద్యార్థులు గంజాయి మత్తుకు అలవాటు పడి, అవి దొరకనప్పుడు రంగుల్లో వాడే టిన్నర్లు, గమ్ములు, వైట్‌నర్లు, నెయిల్‌పాలిష్, కొన్ని రకాల దగ్గు మందులు, ఎనర్జీ డ్రింక్స్ పేరిట రూ.20 కే లభ్యమవుతున్న కూల్‌డ్రింక్స్‌లోకి హాన్స్ పొడి వేసుకుని తాగేస్తున్నారు. ఎక్కువగా గంజాయి సిగరెట్లు, ఖాళీ ప్లాస్టిక్ కూల్‌డ్రింక్ బాటిల్‌కు రంధ్రం పెట్టి, అందులోకి పైపు పెట్టి గంజాయి వేసి బాటిల్ పైభాగంలో నోరు, ముక్కు ద్వారా పీల్చడం చేస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో గంజాయి చాక్లెట్లు సైతం బయటపడిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల బెల్లంలో గంజాయి కలిపి బెల్లం చాకెట్ల పేరిట సైతం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

అనుమానం రాకుండా విక్రయాలు

వైజాగ్, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి రకరకాల మార్గాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు గంజాయి వచ్చి చేరుతోంది. ఆయా ప్రాంతాల్లోని కీలక వ్యక్తులు సరుకును తీసుకుని, దాన్ని ఏజెంట్లకు విక్రయిస్తారు. వారు సిగరెట్లు, బీడీలు, ప్యాకెట్లుగా మార్చి వారికి ఉన్న నెట్‌వర్క్ ద్వారా మత్తుకు అలవాటు పడిన వారికి రహస్యప్రాంతాల్లో అందిస్తుంటారు. మత్తుకు అలవాటు పడిన వారు ఎక్కడ కలుస్తుంటారు ? సరుకు ఎక్కడ ఇవ్వాలి తదితరాలన్నీ రహస్యంగా సాగుతుంటాయి. ఇటీవల పలమనేరుకు చెందిన కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులు వైజాగ్ నుంచి బైక్‌లపై గంజాయి తెస్తూ ఇక్కడి ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. అనుమానం రాకుండా కొందరు మహిళలు పట్టణాల్లోని నివాసాల్లో కావాల్సిన వారికి సరుకును అమ్ముతున్నట్టు తెలుస్తోంది.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలివీ..

- తిరుపతికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు గత నెల 24వ తేదీన గంజాయి మత్తులో ఓ వృద్ధురాలి మెడలో చైన్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. కిందపడి వృద్ధురాలు మృతి చెందగా నేరస్తులుగా మారిన మైనర్ల జీవితాలు ప్రశ్నార్థకరంగా మారాయి.
- చిత్తూరుకు చెందిన ఓ ఎనిమిదో తరగతి బాలుడు తల్లిదండ్రుల మాట వినకుండా ఇంట్లో ముభావంగా ఉంటూ బడికెళ్లనంటూ మారాం చేశాడు. ఓరోజు బాలుడి బ్యాగులో గంజాయి ప్యాకెట్ దొరకడంతో తల్లిదండ్రులు అతడిని ప్రశ్నించగా ఓ అన్న ఇచ్చాడని, తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగడంతో వారు మానసిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.
- పలమనేరు పట్టణానికి చెందిన ఓ బాలుడు ఇంట్లో దాచిన టిన్నర్, వైట్‌నర్‌ను గమనించిన తల్లిదండ్రులు పిల్లాడి ఫ్రెండ్స్‌ను ఆరాతీయగా, వాడు దూరంగా వెళ్లి వాటిని నోట్లో పెట్టి లాగుతుంటాడని చెప్పడంతో హతాశులయ్యారు. దీంతో బాలుని తండ్రి నిత్యం కొడుకు వెళ్లే స్కూల్ వద్ద నిఘా పెడుతున్నాడు.
- పలమనేరు పట్టణంలో కొందరు పిల్లలు గంజాయిని పైప్‌లో కూరి కూల్‌డ్రింగ్ బాటిళ్లతో పీల్చుతుండగా అక్కడున్న పశువుల కాపరి వారించినందుకు అతనిపై దాడికి దిగారు. దీంతో అతను పారిపోయాడు.
- తాజాగా పలమనేరు పట్టణంలో మైనర్లు ఇరువర్గాలుగా రోడ్డుపైనే దాడులు చేసుకున్నారు. వీరిలో చాలామంది మత్తుకు అలవాటు పడిన వారుగానే చెబుతున్నారు.
- మత్తుకు బానిసలైన వారు రాత్రిపూట బైక్‌లపై వెళ్లే వారిని ఆపి, అటాక్ చేసి బంగారు చైన్లు లాక్కోవడం లేదా వారిని కొట్టి బైక్‌ను తీసుకెళ్లడం లాంటివి జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి.
- నిర్మానుష్యమైన రహదారుల్లో బైక్‌పై వెళ్లేవారిని లిఫ్ట్ అడిగి వెనుక నుంచి బ్లేడ్‌తో కోయడం లాంటి ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి.
- మత్తు పదార్థాల కోసం సెల్‌ఫోన్లను చోరీ చేయడం, లేదా ఇంట్లోని సామగ్రిని తాకట్టు పెట్టడం, లోన్‌యాప్‌లో అప్పులు, బైక్‌ల చోరీలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



ఇటీవల పోలీసులు సీజ్ చేసిన గంజాయి చాక్లెట్లు(ఫైల్)



గంజాయి సిగరెట్లు

మత్తుకు అలవాటు పడిన వారి లక్షణాలిలా...

ముఖ్యంగా మత్తుకు అలవాటు పడిన మైనర్లు ఇంట్లో ముభావంగా ఉండడం, నిర్లక్ష్యంగా ప్రవర్తించడం చేస్తుంటారు. పెద్దలు, తల్లిదండ్రులపై గౌరవం ఉండదు. తరచూ ర్యాష్‌గా చూడడం, ఎదురు తిరగడం, దాడికి దిగడం లేదా వారికి వారే చేతులు కోసుకోవడం లాంటివి చేస్తుంటారని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా జుట్టు పెంచుకోవడం, ఎక్కువగా స్నేహితులతో గడపడం, సమయానికి ఇంటికి రావపోవడం తదితర లక్షణాలను కలిగి ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడంటే..



గంజాయి సిగరెట్లు

తిరుపతి పట్టణంలోని నివాస ప్రాంతాలు, రేణిగుంట బైపాస్ రోడ్డు, రైల్వేస్టేషన్, క్రికెట్ గ్రౌండ్లతోపాటు కొన్ని రహస్య ప్రదేశాల్లో వీరు గంజాయిని పీల్చుతున్నట్టు తెలిసింది. ఇక చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు తదితర పట్టణాల్లోనూ కొన్ని ఆవాస ప్రాంతాలు వీరికి అడ్డాలుగా మారాయి.

చిన్నపిల్లలే అలవాటు పడ్డారు..



పట్టణాల్లో చిన్న పిల్లలే గంజాయికి అలవాటు పడ్డారు. వీరు నిత్యం కొన్ని రహస్య ప్రాంతాలకు చేరుకోవడం.. అక్కడ మత్తులో జోగడం కనిపిస్తోంది. వారిని చూసి స్థానికులు సైతం భయపడుతున్నారు. ఇటీవల రెండు వర్గాలు రోడ్డుపై గొడవలు పడ్డాయి. ఇరువర్గాల్లో చిన్నపిల్లలే ఉన్నారు. కొట్టుకుంటూ దుస్తులు చించుకుంటూ రక్తం కారుతున్నా రెచ్చిపోయారు. ఈ ఘటన చూసిన వారికి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారే అని బాధపడ్డారు. - సేటు, పలమనేరు

తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా..



ఇటీవల మైనర్లు మత్తుకు బానిసవడం చూస్తే బాధేస్తోంది. మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే అర్థం కావడం లేదు. ఇలాగే వదిలేస్తే క్రిమినల్స్‌గా మారడం ఖాయం. ముఖ్యంగా బడికెళ్లే పిల్లలు సైతం మత్తుకు అలవాటున్న వారితో స్నేహం చేస్తున్నారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లగానే ఏం చేస్తున్నారు ? వారి ప్రవర్తన ఎలా ఉందని తల్లిదండ్రులు కనిపెట్టాలి. వారి నిర్లక్ష్యంతోనే పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. - కృష్ణమూర్తి రెడ్డి, ప్రిన్సిపల్, పలమనేరు

న్యూస్‌రీల్

నవోదయలో అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : అన్నమయ్య జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి అడ్మిషన్లకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ వేలాయుధన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025–26 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో చదువుతూ 2010 మే 1వ తేదీ నుంచి 2012 జులై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 2008 జూన్ 1వ తేదీ నుంచి 2010 జులై 31వ తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నివాసం జిల్లా పరిధిలోనే ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 9, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 8వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

16న ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : అంతర్జాతీయ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ కంపెనీలో అసోసియేట్ రోల్స్ ఉద్యోగాలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–2024 సంవత్సరాల్లో మ్యాథ్స్‌తో సంబంధం లేని గ్రూపుల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 75 శాతం ఫలితాలు వచ్చిన విద్యార్థులు ఉద్యోగమేళాకు హాజరు కావచ్చన్నారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ఒకేషనల్ కళాశాలలో నిర్వహించబోయే ఉద్యోగ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సంవత్సరానికి రూ.1.70 లక్షలు పొందవచ్చన్నారు. విద్యార్థులు ఇంటర్‌తో మిగిలిపోకుండా ఉన్నత విద్యకు కంపెనీ సహకరిస్తుందన్నారు. శస్త, అమిటీ, కేఎల్ యూనివర్సిటీల్లో బీబీఏ, బీసీఏ, బీకాం కోర్సులు చదివేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. వివరాలకు 6363095030 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ననియాల ఎకో టూరిజం పరిశీలన



ఎకో టూరిజంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్

రామకుప్పం: మండలంలోని ననియాల ఎకో టూరిజాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన ఎకో టూరిజం పార్కులో అసంపూర్తిగా ఉన్న ఏపీ టూరిజం భవనాలను త్వరగా పూర్తి చేయడంతో పాటు చేపట్టాల్సిన పనులపై కడా పీఓ వికాస్ మర్మత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ననియాల ఎకో టూరిజం నుంచి నడుమూరు ఎకో టూరిజం పార్కు, మల్లప్పకొండ, బేటరాయస్వామి ఆలయాల వరకు టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. అక్కడే శిక్షణ పొందిన ఏనుగులు వినాయక్, జయంత్‌ను పరిశీలించి వాటిపోషణ గురించి అటవీ అధికారులతో చర్చించారు. అనంతరం పీఎంకే తాండా వాసుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు, మునుస్వామి, గంట్లప్పగౌడు, అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మార్పు రావాలి

- జిల్లావ్యాప్తంగా 50 డెంగీ కేసులు
- సకాలంలో ఇమ్యునైజేషన్ నిర్వహించేలా చర్యలు చేపట్టండి
- చౌడేపల్లి ప్రభుత్వాస్పత్రిలో డీఐఓ హనుమంతురావు తనిఖీలు



చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రిలో మీడియాతో మాట్లాడుతున్న డీఐఓ హనుమంతు రావు

చౌడేపల్లె: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వేయాల్సిన ఇమ్యునైజేషన్, వ్యాక్సిన్లను సకాలంలో వేసేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ హనుమంతురావు తెలిపారు. గురువారం ఆయన చౌడేపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందిపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టారు. అద్దె భవనంలో పీహెచ్‌సీ నిర్వహిస్తుండగా నిధుల కొరత కారణంగా మార్పు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో లద్దిగం సర్పంచ్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది మీద వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ఉన్నాయని ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. జిల్లాలో 50 డెంగీ నిర్ధారణ కేసులు ఉన్నాయని, వైద్యసిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సహకారంతో వందశాతం ఇమ్యునైజేషన్ వ్యాక్సినేషన్ చేపట్టాలని సూచించారు. బరువు తక్కువ ఉండే చిన్నారులు, రక్తహీనతతో బాధపడే రోగులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల సత్ప్రవర్తనతో మెలిగి వైద్యసేవలు అందించాలని సూచించారు.

పింఛన్లకు 2,948 మంది దూరం

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 2,948 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను నగదు తీసుకోలేదు. అక్టోబర్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండు జిల్లాలో నిర్వహించారు. అయితే రెండు జిల్లాల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించిన దాఖలాలు లేవు. ఇంటి దగ్గరే పంపిణీ చేస్తున్నామని హడావుడి చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. కూటమి నాయకులు తమ ప్రగల్భాల కోసం పింఛన్ల ఇంటివద్దనే పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఏమాత్రం కనిపించడం లేదు. చిత్తూరు జిల్లాలో 2,68,877 మంది పింఛను లబ్ధిదారులున్నారు. ఇందులో ఈనెల 3వ తేదీ సాయంత్రం అధికారిక నివేదికల ప్రకారం 2,67,496 (99.49శాతం) మందికి పింఛన్లు అందజేశారు. మిగిలిన 1,384 మందికి పింఛను నగదు అందించలేకపోయారు. అలాగే తిరుపతి జిల్లాలో 2,66,342 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో 2,64,778 (99.41 శాతం) మందికి పింఛను నగదు అందించారు. మిగిలిన 1,564 మంది పింఛను నగదు పొందలేకపోయారు. కాగా పింఛన్ల పంపిణీ రెండు రోజులు మాత్రమే నిర్వహించడంతో రెండు జిల్లాల్లో 2,948 మంది పింఛన్లు పొందలేకపోయారని పలువురు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉండగా పింఛన్లు పంపిణీలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచే చిత్తూరు జిల్లా మూడో స్థానంలో ఉంది. తిరుపతి జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ఉద్యోగ మేళా రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 5న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి పద్మజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్ టు డిగ్రీ వరకు పాస్/ఫెయిల్, 18–35 ఏళ్లవారు అర్హులన్నారు. వివరాలకు 9160940479, 94418 72140 నంబర్లలో సంప్రదించాలన్నారు

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

పుత్తూరు: వడమాలపేట మండలం పూడి–రేణిగుంట రైల్వే ట్రాక్‌పై గురువారం రాత్రి 7 గంటల సమయంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి కథనం మేరకు.. సుమారు 35 ఏళ్ల వయసు కలిగిన మహిళ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. తల వెనుక భాగంలో బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఆరెంజ్ కలర్ చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


సురేష్(ఫైల్)

నింద్ర: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నింద్ర మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. నింద్ర మండలం కైపాకం గ్రామానికి చెందిన సురేష్ (44)కు కేఆర్ పాళెం లెక్కదాఖలాలో రెండెకరాల వ్యవసాయ పొలం ఉంది. గత పదేళ్లుగా వ్యవసాయం కోసం అప్పులు చేసి తీర్చలేకపోయాడు. చేసిన రూ.6 లక్షలకు వడ్డీ పెరిగిపోయాయి. దీంతో అప్పుల బాధ భరించలేక బుధవారం సాయంత్రం పెయింట్‌లో కలిపే టర్పెంట్ ఆయిల్ తాగాడు. పొలంలో సురేష్ పడి ఉండడాన్ని గమనించిన స్థానిక రైతులు 108 ద్వారా నగరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య మాల, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడు సురేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నింద్ర సీఐ భాస్కర్ తెలిపారు.

పకడ్బందీగా టెట్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలు గురువారం పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరిగాయి. మొదటి రోజు పరీక్షలకు జిల్లాలోని నాలుగు, తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 260 మంది అభ్యర్థులకు గానూ 227 మంది హాజరయ్యారు. 33 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన సెషన్‌లో 232 మంది అభ్యర్థులకు గానూ 208 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర అబ్జర్వర్, డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు.

టెట్ నిర్వహణకు బడ్జెట్ విడుదల

జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) నిర్వహణకు బడ్జెట్ విడుదల చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీ చేసిన ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలో టెట్ పరీక్షల నిర్వహణ కోసం 1,86,700ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌ను ఖర్చు చేయాల్సిన విధివిధానాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


శ్రీవారి ఆలయంలో పుష్పాలంకరణ

అంకురార్పణ.. విష్వక్సేనుడి వీక్షణ

వెంకన్న బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలు ధరించి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాలతో భేరీ నినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో ఊరేగి, కలియుగ వైకుంఠ వాసుడికి బ్రహ్మ స్వయంగా నిర్వహించే ఉత్సవాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవదేవుడి కోవెలను ఫల,పుష్పాలతో కనువిందుగా అలంకరించారు.

– తిరుమల


తిరుచ్చిపై ఊరేగుతున్న విష్వక్సేనుడు

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు

- క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించండి
- జాయింట్ కలెక్టర్ విద్యాధరి


సమీక్షలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదైన వినతుల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించకూడదని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల వినతులపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రజలు అధికారుల చుట్టూ తిరగకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం చూపితే శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. సీఎం, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ రైట్స్ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించి సీసీఎల్ఏ నుంచి అందిన ప్రొఫార్మాలో నమోదు చేసి శుక్రవారం సాయంత్రంలోపు ఆర్‌డీఓలకు అందజేయాలన్నారు. సంబంధిత ఆర్‌డీఓలు మరోసారి ప్రొఫార్మాలను పరిశీలించి కలెక్టరేట్‌కు శనివారం సాయంత్రంలోపు పంపాలన్నారు. నేషనల్ హైవేకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్‌ఓ పుల్లయ్య, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ

తిరుపతి కల్చరల్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ హెచ్చరించారు. నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం చిత్తూరు ఉమ్మడి జిల్లాల యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈనెల 10వ తేదీ నాటికి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతోందన్నారు. మేనిఫెస్టోలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి మూడు నెలల సమయం చాలని ప్రకటించిన పాలకులు ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారానికి కనీసం ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ జేఏసీని పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు జరపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11.500 వేతనం ఇస్తుంటే తెలంగాణలో రూ.13,650 వేతనం చెల్లిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్.జ్యోతి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌యాప్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, నాయకులు పి.వెంకటరత్నం, శోభ, ఆర్.వెంకటరత్నం పాల్గొన్నారు.

సారా స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరులో సారా విక్రయిస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. నగరంలోని బండపల్లి కూడలి వద్ద సారా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. బండపల్లి పోలీసులు వెళ్లి తనిఖీలు చేసి సారా విక్రయిస్తున్న భారత్‌నగర్‌కు చెందిన చిన్నయ్య (58), ఆరోజ్ (60), అశోక పురానికి చెందిన ఉస్మాన్ ఖాన్ (40) అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా.. రిమాండ్ విధించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

జీతం కోసం ఎదురు చూపులు

చిత్తూరు కలెక్టరేట్ : అధికారంలోకి వస్తే ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతం ఇస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఆ మాటను నిలబెట్టుకోలేకపోతోంది. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటోతేదీ ఉద్యోగులకు జీతం ఇచ్చే విషయంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. గత నెల జీతం ఇంతవరకు జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులకు జమకాని పరిస్థితి నెలకొంది. ఒకటో తేదీన జీతం కోసం ఎదురు చూసిన ఉద్యోగులు నిరాశకు లోనయ్యారు. రెండవ తేదీన గాంధీ జయంతి కావడంతో మూడవ తేదీన జమ అవుతుందని అనుకున్నారు. 3వ తేదీ సైతం జీతం జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లకు, టీచర్లకు, ఐసీడీఎస్ ఉద్యోగులకు జీతాలు జమకాలేదు. జిల్లాలో 9,162 మంది టీచర్లు, 31 మండలాల తహసీల్దార్లు, ఐసీడీఎస్, ఇతర శాఖల ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఒకటో తేదీన జీతం ఇవ్వకుండానే ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇస్తున్నట్లు కూటమి నాయకులు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట

శ్రీకాళహస్తి: పట్టణంలోని కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్టతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, ఓంశక్తి నామస్మరణల నడుమ కలశంతో ఆలయ ప్రాకారోత్సవం, అష్టబంధన పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలు, చందనం, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


మృతి చెందిన అనంతవర్మ

నింద్ర: గుర్తు తెలియని వాహనం ఢీకొని అనంతవర్మ(52) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రం నింద్రలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా రాజపాళెం గ్రామానికి చెందిన అనంతవర్మ గురువారం సాయంత్రం విజయపురం మండలం పన్నూరుకు బైక్‌పై వెళ్తుండగా నింద్ర కాటన్‌మిల్ వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


యుగంధర్‌గౌడు(ఫైల్)

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె–పుంగనూరు జాతీయ రహదారిలోని చిన్నచల్లారగుంట వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యుగంధర్‌గౌడు(48) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈనెల 2వ తేదీన నాలుగురోడ్ల నుంచి యుగంధర్‌గౌడ్ స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. గాయపడిన అతన్ని 108 వాహనంలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


రాజేశ్వరి

గంగాధర నెల్లూరు: మండలంలో కొత్త వెంకటాపురం పంచాయతీకి చెందిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక సీఐ లక్ష్మీ నారాయణ కథనం మేరకు వివరాలు.. మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీ కెవి దొడ్డిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి సుమిత్ర దంపతుల కుమార్తె రాజేశ్వరి (19) గత మంగళవారం రోజు నుంచి కనపించడం లేదు. దీంతో యువతి తల్లిదండ్రులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యువతి అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీ నారాయణ తెలిపారు.

బావిలో యువకుడి శవం

- చంద్రగిరికి చెందిన హేమంత్‌గా గుర్తింపు

చంద్రగిరి: మండలంలోని బుచ్చినాయుడుపల్లె శివారులోని ఓ బావిలో యువకుడి శవమై కనిపించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతుల కుమారుడు హేమంత్(22) ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. 30వ తేదీన యథావిధిగా విధులకు వెళ్లిన హేమంత్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హేమంత్ కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో గురువారం బుచ్చినాయుడుపల్లెకు చెందిన మునిరత్నం నాయుడు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి మోటారు వేసేందుకు బావిలో చూడగా యువకుడు మృతి చెందినట్లు గమనించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలోని మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించగా హేమంత్‌గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హేమంత్ అనుప్పల్లి పంచాయతీ రేకలచేనుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నడుపుతున్న నేపథ్యంలో ఆమెను కలిసేందుకు ఐదు రోజుల క్రితం ఆమె ఉన్న గ్రామానికి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా ఆమె మరిది పత్తార్ల జగదీష్, హేమంత్‌పై దాడి చేసి, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం లాక్కొన్నాడు. అప్పటి నుంచి హేమంత్‌ను తరచూ బెదిరిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో హేమంత్ కనిపించకపోవడంతో బుధవారం మృతుడి తల్లిదండ్రులు మహిళతో వాగ్వివాదానికి దిగినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో 30వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన హేమంత్ చివరగా తన స్నేహితుడిని కలసి జగదీష్ వేధింపులను వివరించాడు. ఆపై అతను కనపించకుండా పోయాడు. ఈ క్రమంలో గురువారం బావిలో శవమై తేలాడు. అసలు జగదీష్‌ది ఆత్మహత్యా..హత్యా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళతోపాటు ఆమె మరిదిపై అనుమానం ఉన్నట్లుగా మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు మిత్రుల మృతి

- మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది
- బంగారుపాళెం మండలం ఊటువంకలో ఘటన


చెరువులో మునిగి మృతి చెందిన తౌహిద్

బంగారుపాళెం: ఈత సరదా ఇద్దరు మిత్రులను బలిగొన్న సంఘటన గురువారం సాయంత్రం బంగారుపాళెం మండలం ఊటువంక కామాక్షమ్మ చెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీకి చెందిన లేట్ ఖాదర్‌బాషా కుమారుడు తౌహిద్(16), మహబూబ్‌హేబ్ కుమారుడు ఇర్ఫాన్(17) గురువారం మధ్యాహ్నం కామాక్షమ్మచెరువు వద్ద ఈతకు వెళ్లారు. ముందుగా తౌహిద్, ఇర్ఫాన్ చెరువులోకి దిగి ముందుకు వెళ్లారు. లోతు ఉన్న ప్రాంతంలోకి వెళ్లడంతో ఇద్దరూ మునిగిపోయారు. చెరువు గట్టుపై ఉన్న మరో యువకుడు ఇద్దరు వ్యక్తులు మునిగిపోతున్నారని సమీపంలో వెళ్తున్న గ్రామస్తులకు తెలిపాడు. స్థానికుల సమాచారం మేరకు ఏఎస్‌ఐ మల్లప్ప, సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని అప్పటికే మృతి చెందిన తౌహిద్‌ను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. మరో యువకుడు ఇర్ఫాన్ మృతదేహం చెరువులోనే ఉండడంతో చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించి బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు యువకులు చెరువులో మునిగి మృతి చెందడంతో ఇందిరమ్మ కాలనీలో విషాదచాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమన్వయంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం


ఎస్పీని సన్మానిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: అన్ని శాఖల అధికారులు, ఉభయదారులు, భక్తుల సమన్వయంతోనే వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తి చేశామని జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ గురుప్రసాద్ అన్నారు. కాణిపాకంలోని దేవస్థానం ఆస్థాన మండపంలో గురువారం సేవలు అందించిన అధికారులు, సిబ్బంది, ఉభయదారులకు సత్కారం చేశారు. తొలుత జేసీ, ఎస్పీని దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించి స్వామిప్రసాదం అందజేశారు. అనంతరం పలుశాఖల అధికారులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర, ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, ధనంజయ్య తదితరులు ఉన్నారు.

వీధి రౌడీల్లా కొట్టుకున్న విద్యార్థులు


- కేక్ విషయంలో గొడవ
- విద్యార్థిపై మరో గ్యాంగ్ దాడి
- ఇరువర్గాలపై కేసులు నమోదు


దాడిలో గాయపడిన సంతోష్

పలమనేరు: కేక్ కటింగ్ విషయంలో మొదలైన గొడవతో ఓ విద్యార్థిని మరోవర్గం విద్యార్థులు వారి స్నేహితులు కలిసి కళాశాల ముందే నడిరోడ్డుపై దాడి చేసిన ఘటన మూడురోజుల క్రితం జరగ్గా గురువారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. స్థానిక రఘువీరారెడ్డి కాలనీకి చెందిన సంతోష్(18) పట్టణ సమీపంలోని మదర్‌థెరీసా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో కేక్ కటింగ్ సమయంలో సంతోష్‌పై పడిందని అక్కడ కేక్ కట్ చేసిన విద్యార్థులతో గొడవకు దిగాడు. దీంతో వారు తమ స్నేహితులను రప్పించి కళాశాల వద్దనే సంతోష్‌ను చితకబాది వారి వెంట తీసుకెళ్లి మరోమారు దాడికి పాల్పడ్డారు. గాయపడి ఆస్పత్రిలో చేరిన బాధితుడు తనపై దాడి జరిగిందంటూ ఇందుకు కారణమైన సహచర విద్యార్థులు, పట్టణానికి చెందిన పలువురిపై గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల వినాయకుడి నిమజ్జనం సందర్భంగా సంతోష్‌కు, మరికొందరికి జరిగిన గొడవ కారణంగానే ఈ దాడులు జరిగినట్టు తెలుస్తోంది. కళాశాలలో బుద్ధిగా చదువుకోవాల్సిన విద్యార్థులు వీధిరౌడీల్లా రోడ్లపై కొట్టుకోవడం ఏంటని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే గత కొంతకాలంగా ఇలాంటి గొడవలు హెచ్చుమీరుతున్నాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన గంగవరం పోలీసులు విచారిస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- టీటీడీ ఈఓ శ్యామలరావు


మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీలోని అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం ఈఓ, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు రద్దు చేసినట్లు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 7 లక్షల లడ్డూలను నిల్వ ఉంచామన్నారు. 8వ తేదీ గరుడసేవ రోజు బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేశామన్నారు. దాదాపు 1,250 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, 3900 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించామన్నారు. ఆలయ మాడ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,775 సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామని చెప్పారు. లక్షలాది భక్తులు వాహన సేవలు వీక్షించేందుకు తిరుమలలో ఎల్ఈడీ స్క్రీన్లు 9 రోజుల పాటు 28 స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుమలలోని బాలాజీనగర్, కౌస్తుభం ఎదురుగా, రాంభగీచా బస్టాండ్, ముళ్లగుంత, తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ , శ్రీవారి మెట్టు వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. తిరుమలలో సామాన్య భక్తుల కోసం 6,282 గదులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీఐపీ ఏరియాలో 1,353 గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లు, అన్నప్రసాదం, పాలు, అల్పాహారం వితరణకు ఏర్పాట్లు చేమాని చెప్పారు. అశ్విని ఆస్పత్రి, వైకుంఠం క్యూకాంప్లెక్సుల్లోని వైద్యకేంద్రాలు, 6 డిస్పెన్సరీల్లో అదనపు సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుమలలోని జీఎన్‌సీ, సీఆర్వో, ప్రధాన కల్యాణకట్ట, భజనమందిరం, ఏటీసీ సమాచార కేంద్రాలతో పాటు ఈ ఏడాది అదనంగా పీఏసీ–2, వీజీఓ కార్యాలయం సమీపంలో, రాంభగీచ అతిథి గృహం వద్ద, మ్యూజియం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా టీటీడీకి సంబంధించిన సమాచారం కరపత్రాలను భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. శ్రీవారి సేవకులు అన్ని విభాగాల్లో సేవలందిస్తారన్నారు. సమావేశంలో జేఈఓలు గౌతమి, వీర బ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈవో మాట్లాడుతూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుందన్నారు. గరుడవాహన సేవ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. అక్టోబర్ 4న సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. 5వ తేదీ తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున రూ.13.45 కోట్లతో నూతనంగా నిర్మించిన వకుళమాత కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు.